హైదరాబాద్
11-10-2023
సంపుటి:08
సంచిక: 366
పేజీలు: 4
వెల: రూ.5/-
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## 2050 నాటికి బ్రెయిన్ స్ట్రోక్‌లు 50% పెరుగుతాయ్



న్యూఢిల్లీ, అక్టోబరు 10: వచ్చే మూడు దశాబ్దాల్లో బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించే వారి సంఖ్య 50 శాతం పెరుగుతుందని తాజా అధ్యయనం హెచ్చరించింది. 2050 నాటికి స్ట్రోక్‌తో మరణించేవారి సంఖ్య 50 శాతం పెరుగుతుందని,

2లో

## కులగణన అంటే ఎక్స్‌రే

**బడుగుల స్థితిగతులు బయటికొస్తాయి: రాహుల్**

న్యూఢిల్లీ, అక్టోబరు 10: కులాలవారీగా జనాభా లెక్కింపు.. దేశాన్ని ఎక్స్‌రే తీయడం వంటిదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు.



2లో

# ప్రపంచంతో పోటీ పడండి

పెద్ద పెద్ద కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి.. దీనికి చదువు ఒక్కటే మార్గం

ప్రపంచంలో 350 టాప్ కాలేజీల్లో సీటు తెచ్చుకోండి

ప్రభుత్వమే మిమ్మల్ని చదివిస్తుంది.. రూ.1.25 కోట్ల వరకు ఫీజును చెల్లిస్తాం

అమెరికా వెళ్లొచ్చిన ప్రభుత్వ విద్యార్థులతో సీఎం వైఎస్ జగన్

జీఆర్‌ఈ, జీమ్యాట్‌లకు కూడా .. ఉచిత శిక్షణ ఇవ్వాలని అధికారులకు ఆదేశం

మీ గొప్ప విజన్ వల్లే అమెరికా వెళ్లగలిగామని కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు

అమరావతి: ప్రపంచంతో పోటీపడితేనే మన బతుకులు మారతాయని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్ఘాటించారు. పేదరికం సమసిపోవాలంటే దానికి విద్య ఒక్కటే మార్గమని తెలిపారు. ఐక్యరాజ్యసమితి సదస్సులో పాల్గొనడానికి 10 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గతనెలలో 15 రోజులపాటు అమెరికాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వారంతా సోమువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. 'అమెరికా పర్యటన ద్వారా గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌పైకి వెళ్లడానికి మీకు ఆ అనుభవాలు ఉపయోగపడతాయి.

2లో

# శవాల దిబ్బలు.. శిథిల దృశ్యాలు

గాజా స్ట్రిప్‌లోని ఖాన్ యూనిస్‌లో భవన శిథిలాలను తొలగిస్తున్న పాలస్తీనియన్లు

ఇజ్రాయెల్ హమాస్ యుద్ధంలో ఇప్పటికే 1,800 మంది బలి

ఇజ్రాయెల్‌లో 1,000 మంది,గాజా, వెస్ట్‌బ్యాంకులో 800 మంది మృతి

నాలుగో రోజుకు చేరిన ఇజ్రాయెల్ వైమానిక దాడులు

మా లక్ష్యం హమాస్ మాత్రమే: ప్రధాని నెతన్యాహు

గాజాపై దాడులు ఆపకపోతే బందీలను చంపేస్తాం

ఇజ్రాయెల్‌కు హమాస్ హెచ్చరిక



జెరూసలేం న్యూఢిల్లీ: ఇజ్రాయెల్ వైమానిక దాడులతో గాజా సిటీ దద్దరిల్లిపోతోంది. వందలాది భవనాలు ధ్వంసమవుతున్నాయి. శిథిలాలు దర్శనమిస్తున్నాయి.



# రింగ్ రోడ్డు ప్రశ్న ఒకటే!

## సంబంధం లేనివి 49

సీఐడీ విచారణ తీరుపై లోకేశ్ వ్యాఖ్య

ఎలైన్‌మెంట్‌పై ఒక్క ఆధారమూ చూపలేదు

ఇవి గూగుల్‌లో కూడా తెలుసుకోవచ్చు

తప్పు చేయనప్పుడు భయపడను

దేనికైనా జవాబివ్వడానికి రెడీ

మళ్లీ నేడు రమ్మన్నారు.. 2 గంటలైనా ఉంటా

ఇప్పుడే అడగాలన్నా.. కానీ మళ్లీ నోటీసిచ్చారు

నేడు మళ్లీ సీఐడీ ముందు హాజరవుతా: లోకేశ్

అమరావతి: రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్‌ఆర్) కేసులో విచారణకు పిలిచిన సీఐడీ అధికారులు దానికి సంబంధించిన ప్రశ్న ఒకటి మాత్రమే అడిగారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ తెలిపారు.

2లో

# కమలం సర్కార్‌ను తెద్దాం

## ఆదిలాబాద్ జనగర్జన సభలో అమిత్ షా

పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిందేమీ లేదు

రాష్ట్రం నంబర్ వన్‌గా ఉందంటూ అబద్ధపు ప్రచారం చేస్తున్నారు

ఒవైసీ చేతిలో 'కారు'స్టీరింగ్

ఇవాళ్టి రజాకారుల నుంచి బీజేపీతోనే రక్షణ లభిస్తుంది

డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పడితే అభివృద్ధి జరుగుతుంది..

రాహుల్ బాబా ఏదేదో చేస్తామని చెబుతూ తిరుగుతున్నారు..

యూపీఏ హయాంలో రూ.12 లక్షల కోట్ల అవినీతి





జఆదిలాబాద్: బీఆర్‌ఎస్ ఎన్నికల గుర్తైన కారు స్టీరింగ్ మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేతిలో ఉందని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విమర్శించారు. మజ్లిస్ కనుసన్నల్లో నడిచే కేసీఆర్ సర్కార్‌ను పీకి పారేద్దామని, డిసెంబర్ 3న తెలంగాణ రాష్ట్రంలో కమలం సర్కార్‌ను తీసుకొ ద్దామని పిలుపునిచ్చారు. ఇవాళ్టి రజాకారుల నుంచి బీజేపీతోనే రక్షణ లభిస్తుందని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించారు. బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జనగర్జన బహిరంగ సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కేటీఆర్‌ను సీఎం ఎలా చేయాలన్నదే కేసీఆర్ ఆలోచన ప్రధాని మోదీ నేతృత్వంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పడితే అభివృద్ధి జరుగుతుందని అమిత్‌షా చెప్పారు. ఇటీవల మోదీ రాష్ట్రంలో పర్యటించినప్పుడు రూ.950 కోట్లతో సమ్మక్క–సారక్క యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారని, వాస్తవానికి దీన్ని 2014 నుంచే ఏర్పాటు చేయాలని అనుకున్నప్పటికీ కేసీఆర్ సర్కార్ స్థలం ఇవ్వకపోవడంతో ఆలస్యమైందని విమర్శించారు.గిరిజనుల ఉన్నత చదువులకు, అలాగే వారి సంస్కృతి, ఆచారాలను కాపాడేందుకు వర్సిటీ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

2లో

# గ్రూప్–2 మళ్లీ వాయిదా

సిబ్బందిని సర్దలేమన్న కలెక్టర్లు!

జనవరి 6, 7 తేదీల్లో నిర్వహణ

వెల్లడించిన టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి

హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎసపీఎస్సీ) గ్రూప్–2 పరీక్షలు మళ్లీ వాయిదా పడ్డాయి. ఈ సారి వాయిదాకు



TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION: HYDERABAD

GROUP-II SERVICES (GENERAL RECRUITMENT)

NOTIFICATION NO.28/2022, DT:29/12/2022

REVISED WEB NOTE

It is hereby informed that the Commission has re-scheduled the written examinations to the posts falling under GROUP II Services, vide Notification No.28/2022, dated:29/12/2022 which were scheduled to be held on 29/08/2023 & 30/08/2023 and these examinations will now be held on 02/11/2023 FN & AN and 03/11/2023 FN & AN from 10.00 AM to 12.30 PM & 02:30 PM to 05:00 PM respectively.

The candidates are instructed to download their hall tickets on Commission's website https://www.tspsc.gov.in one week before the examination date.

Place: Hyderabad,
Dated:13/08/2023

Sd/-
SECRETARY

# శవాల దిబ్బలు.. శిథిల దృశ్యాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం నాలుగో రోజుకు చేరింది. మంగళవారం తెల్లవారుజాము నుంచే ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు గర్జించాయి. గాజాపై బాంబుల వర్షం కురిపించాయి. ఇరువైపులా ఇప్పటికే దాదాపు 1,800 మంది మరణించారు. ఇజ్రాయెల్‌లో 1,000 మందికిపైగా, గాజా, వెస్ట్‌బ్యాంకులో 800 మంది మరణించినట్లు స్థానిక అధికారులు తెలిపారు.కొన్ని ప్రాంతాల్లో శవాల దిబ్బలు కనిపించాయన్నారు. దాడులు, ప్రతిదాడుల్లో వేలాది మంది క్షతగాత్రులుగా మారారు. అంతర్జాతీయ సమాజం నుంచి ఇజ్రాయెల్‌కు మద్దతు వెల్లువెత్తుతోంది. హమాస్ మిలిటెంట్ల ఘాతుకాలను ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి. శత్రువులపై తమ ఎదురుదాడి కొన్ని తరాలపాటు ప్రతిధ్వనించేలా ఉంటుందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ స్పష్టం చేశారు.ఆయన తాజాగా జాతినుద్దేశించి ప్రసంగించారు. తమ లక్ష్యం కేవలం హమాస్ మాత్రమేనని అన్నారు. మరోవైపు ఇజ్రాయెల్ గనుక తమపై వైమానిక దాడులు ఇలాగే కొనసాగిస్తే.. ఇప్పటికే తమ ఆధీనంలో ఉన్న బందీలను చంపేస్తామని హమాస్ హెచ్చరించడం ఆందోళన కలిగిస్తోంది. దాడులు వెంటనే ఆపాలని హమాస్ డిమాండ్ చేస్తోంది. దేశ సరిహద్దులపై పూర్తి పట్టు సాధించామని, తీవ్రవాదులు చొరబడకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. తమ దేశంలో వందలాదిగా హమాస్ మిలిటెంట్ల మృతదేహాలను గుర్తించామని తెలియజేసింది. తమ దాడుల్లో వారు మృతిచెందినట్లు పేర్కొంది. హమాస్‌తోపాటు ఇతర మిలిటెంట్ గ్రూప్‌లు తమ దేశం నుంచి 150కిపైగా జనాన్ని బందీలుగా తీసుకెళ్లాయని ఇజ్రాయెల్ తెలిపింది. వీరిలో సైనికులు, సాధారణ పౌరులు ఉన్నారని వివరించింది. హమాస్ ఆధీనంలో ఉన్న తమ వారిని వెంటనే విడిపించాలని బందీల కుటుంబ సభ్యులు కోరుతున్నారు. బందీలను క్షేమంగా వెనక్కి తీసుకొస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి ఎలీ కోహెన్ చెప్పారు.బందీలకు ఏమైనా జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హమాస్‌ను హెచ్చరించారు. గాజాపై భూభాగం గుండా దాడి చేయాలని ఇజ్రాయెల్ సైన్యం నిర్ణయించినట్లు సమాచారం. ఇందుకోసం 3 లక్షల రిజర్వ్ సైనికులను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇలాంటి దాడి గాజాపై చివరిసారిగా 2014లో జరిగింది. ఇదిలా ఉండగా, శనివారం కారులో పారిపోతున్న ఇద్దరు హమాస్ తీవ్రవాదుల ను ఇజ్రాయెల్ బోర్డర్ పోలీసులు బైక్‌లపై వెంటాడి కాల్చిచంపిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఉగ్రవాదాన్ని భారత్ బలంగా, నిస్సందేహంగా వ్యతిరేకిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అరికట్టాల్సిందేనని అన్నారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మంగళవారం ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. తమ దేశంపై హమాస్ మిలిటెంట్ల దాడులు, తదనంతర పరిస్థితుల గురించి వివరించారు. అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రస్తుత విపత్కర సమయంలో భారతీయులు ఇజ్రాయెల్‌కు అండగా నిలుస్తున్నారని వెల్లడించారు. తమ మద్దతు ఇజ్రాయెల్‌కు ఉంటుందని చెప్పారు. తనకు ఫోన్ చేసి, తాజా పరిస్థితిని వివరించిన నెతన్యాహూకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

ఇజ్రాయెల్‌కు తమ మద్దతు కచ్చితంగా ఉంటుందని యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధానమంత్రి రిషి సునాక్ చెప్పారు. హమాస్ రాక్షసకాండను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. యూకేలోని యూదుల రక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రిషి సునాక్ మంగళవారం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్, జర్మనీ చాన్సలర్ ఒలాఫ్ స్కాల్జ్, ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీతో మాట్లాడారు. ఇజ్రాయెల్%--%హమాస్ ఘర్షణపై చర్చించారు. వారితో కలిసి ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. హమాస్ ఉగ్రవాద చర్యలను సహించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. తనను తాను రక్షించుకొనే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని, ఆ విషయంలో ఇజ్రాయెల్‌కు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

ఇజ్రాయెల్‌లో యుద్ధ వాతావరణం నెలకొంది. ఇజ్రాయెల్%--%హమాస్ మధ్య ఉద్రిక్తతలు ఇప్పట్లో చల్లారే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఇజ్రాయెల్ నుంచి తమ విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు పలు అంతర్జాతీయ విమానయాన సంస్థలు ప్రకటించాయి. టెల్ అవివ్‌లోని బెన్ గురియన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో మంగళవారం పలు విమానాలు నిలిచిపోయాయి.

# గ్రూప్-2 మళ్లీ వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల హడావుడే కారణం కావడం గమనార్హం..! 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ గత ఏడాది నోటిఫికేషన్(28/2022)ను జారీ చేయగా.. 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. టీఎస్‌పీఎస్సీ తొలుత ఈ ఏడాది ఆగస్టు 29, 30 తేదీల్లో పరీక్షలకు షెడ్యూల్‌ను ఖరారు చేసింది. వరుసగా ఇతర పోటీ పరీక్షలు కూడా ఉండడంతో.. గ్రూప్-2ను వాయిదా వేయాలంటూ నిరుద్యోగులు, రాజకీయ పార్టీల నుంచి డిమాండ్లు వచ్చాయి. అప్పట్లో ఆందోళనలు ఉధృతమవుతున్న తరుణంలో పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. నవంబరు 2, 3 తేదీల్లో గ్రూప్-2ను నిర్వహిస్తామని పేర్కొంటూ.. అందుకు ఏర్పాట్లను చేస్తోంది.అయితే.. తెలంగాణతోపాటు.. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) సోమవారం ప్రకటన చేయడం.. నవంబరు 3న ఎన్నికల నోటిఫికేషన్ ఉండడంతో టీఎస్‌పీఎస్సీ పునరాలోచనలో పడింది. దీంతో మంగళవారం టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బి.జనార్దన్‌రెడ్డి నేతృత్వంలో సుదీర్ఘ సమావేశం జరిగింది. అప్పటికే.. ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో నామినేషన్లు, ఇతర పనుల కారణంగా సిబ్బందిని సమకూర్చలేమంటూ జిల్లాల కలెక్టర్లు టీఎస్‌పీఎస్సీకి తెలిపారు. అదేవిధంగా ఎన్నికల విధులు, నగదు/బంగారం/మద్యం/తాయిలాల తరలింపుపై నిఘా పెట్టాలని, సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిరంతరాయంగా పనిచేయాల్సి ఉంటుందని, అభ్యర్థుల భద్రత, ఇతర అంశాల నేపథ్యంలో గ్రూప్-2 పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు సాధ్యం కాకపోవచ్చంటూ ఎస్పీలు వివరించారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న టీఎస్‌పీఎస్సీ.. గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయాలని నిర్ణయించింది. వచ్చే ఏడాది జనవరి 6, 7 తేదీల్లో ఆ పరీక్షలను నిర్వహిస్తామంటూ టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితారామచంద్రన్ మంగళవారం ఓ ప్రకటనను విడుదల చేశారు.

# ప్రపంచంతో పోటీ పడండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచుస్థాయికి ఎదగాలన్న కోరిక మీకు మరింత గట్టిపడుతుంది. ఈ పర్యటన మీ మనసులో ఒక ముద్ర వేస్తుంది. ప్రపంచం ఎలా ఉంది? మనం ఎక్కడ ఉన్నాం? ఎంత వెనుకబడి ఉన్నాం? అనేది అర్థముఫుతుంది. ప్రపంచం వేగంగా పరుగులు తీస్తోంది. మనం చాలా వెనుకబడి ఉన్నాం.. ప్రపంచంతో మనం పోటీపడి నిలబడాలి. అప్పుడే మన బతుకులు మారుతాయి. ఇందుకు చదువు ఒక్కటే సాధునం' అని విద్యార్థులకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. విద్య అనే సాధనం ద్వారా పెద్ద పెద్ద కలలను కనాలని సూచించారు. ఆ కలల నుంచే వాస్తవాలు సాకారం అవుతాయన్నారు. విద్యార్థులు చూసిన కొలంబియా యూనిముర్సిటీ లాంటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 350 కాలేజీల్లో 21 కోర్సుల్లో సీటు సాధిస్తే ప్రభుత్వమే చదివిస్తుందని సీఎం జగన్ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. సంబంధిత కాలేజీల్లో ఫీజులు రూ.80 లక్షల నుంచి రూ.1 కోటి వరకూ ఉంటాయన్నారు. వీటిలో సీటు తెచ్చుకుంటే జగనన్న విదేశీ విద్యాదీవెన ద్వారా రూ.1.25 కోట్ల వరకు ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. 'సీఈవో వంటి స్థాయికి వెళ్లాలంటే ప్రతిభ, నైపుణ్యం ఉండాలి. మనం చదివే చదువులవల్లే ఇవి వస్తాయి. ప్రపంచ అత్యుత్తుమ కాలేజీల్లో చదువుకోవడం ద్వారా మీ నైపుణ్యానికి మంచి గుర్తింపు లభిస్తుంది. అప్పుడు ప్రపంచంలోనే అత్యుత్తమ కంపెనీలు మీకు మంచిస్థానాల్లో ఉద్యోగాలు కల్పిస్తాయి.తద్వారా మీ జీవితాలు మారతాయి. అలాంటి కాలేజీల్లో విద్యాభ్యాసం కోసం, సీటు సాధించేందుకు మీరు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలి' అని సీఎం జగన్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. 'మీకు ఆసక్తి ఉన్న కోర్సు ఏంటి? ప్రపంచంలో ఈ కోర్సును అందిస్తున్న అత్యుత్తమ కాలేజీలు ఎక్కడ ఉన్నాయి?' అనేది ఇప్పటి నుంచే తెలుసుకోవాలని సూచించారు. ఆ కాలేజీల్లో సీటు రావాలంటేం ఏయే పరీక్షల్లో ఎన్ని మార్కులు రావాలో కూడా తెలుసుకోవాలన్నారు. జీమ్యాట్, జీఆర్‌ఈ, టోఫెల్ వంటి పరీక్షలు ఏమున్నాయో.. వాటికి ఎలా సన్నద్ధం కావాలో తెలియాలన్నారు. టోఫెల్‌కు ఎలా తీసుకువచ్చామో.. అలాగే జీఆర్ఈ, జీమ్యాట్‌లకు కూడా మెటీరియల్, ఉచిత శిక్షణను విద్యార్థులకు అందించాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. విదేశీ విద్యాదీవెన ద్వారా సీటు సాధించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని విద్యార్థులకు సూచించారు. కొలంబియా యూనివర్సిటీ, వార్టన్, ఎల్‌ఎస్‌ఈ, ఇన్‌సీడ్.. ఇలాంటి యూనివర్సిటీలు, కాలేజీలు 350 ఉన్నాయని.. వీటిలో సీటు సాధించాలని హితబోధ చేశారు. ఆ కాలేజీల్లో కోర్సులు పూర్తి చేశాక విద్యార్థుల జీవితాల్లో మంచి మార్పులు వస్తాయన్నారు. ఇది సాకారమైతే మీ, మీ కుటుంబాల బతుకులు మారడమే కాకుండా రాష్ట్ర ప్రతిష్టను కూడా పెంచినవారవుతారన్నారు. అంతేకాకుండా మీ స్థాయిలో మరో పది మందికి సహాయపడొచ్చని విద్యార్థులకు సీఎం హితబోధ చేశారు. విద్యార్థులుకు మార్గనిర్దేశం చేసేందుకు ఓ ఐఏఎస్ అధికారిని నియమించాలని అధికారులను ఆదేశించారు. 'ఇక్కడున్న ఈ పిల్లలు చిన్నప్పుడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాలని కలలు కని ఉంటారు.. చాలా మందికి సీట్లు వచ్చాయి. ఆ విజన్ అక్కడితో పూర్తయ్యింది. ఇప్పుడు ట్రిపుల్ ఐటీ నుంచి తర్వాత ఎక్కడికి అనేది విజన్ కావాలి' అని సీఎం పేర్కొన్నారు. మన పాఠ్యప్రణాళికలో లేని 1,800 సబ్జెక్టులను పాఠ్యప్రణాళికలోకి తెస్తున్నామని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. ఎంఐటీ, హార్వర్డ్ వంటి యూనివర్సిటీ నిపుణులతో తయారు చేయించిన సబ్జెక్టులను మన విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఎడెక్స్‌తో ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. ఈ కోర్సులు చేసిన వారికి జాయింట్ సర్టిఫికేషన్ కూడా లభిస్తుందన్నారు.ఈ కోర్సులు నేర్చుకోవాలని.. దీనివల్ల ఉపయోగం ఉంటుందని విద్యార్థులకు సూచించారు. 'మీరు ఇలా విదేశాలకు వెళ్లి బయటి ప్రపంచం చూసినప్పుడు మరింత కష్టపడాలన్న స్ఫూర్తి మీలో కలుగుతుంది. ఈ పర్యటన మీకు మాత్రమే కాకుండా, మీ వల్ల ఇతరులకు కూడా స్ఫూర్తి కలిగిస్తుంది. ఒక స్థాయిలో ఉన్న మనం బాగా కష్టపడటం ద్వారా మరో స్థాయికి చేరుకుంటాం. మన కష్టమే మనల్ని పై స్థానాలకు తీసుకెళుతుంది. మీ అందరికీ అభినందనలు' అని సీఎం జగన్ పేర్కొన్నారు.

అమెరికాలో పర్యటించిన విద్యార్థులు శిములింగమ్మ, చంద్రలేఖ, గణేశ్, జ్యోత్స్న, రాజేశ్వరి, గాయత్రి, రిషితారెడ్డి, యోగీశ్వర్, షేక్ అమ్మాజాన్, మనస్వినిలతోపాటు వారి తల్లిదండ్రులను అధికారులు సీఎం వైఎస్ జగన్‌కు పరిచయం చేశారు. ఐక్యరాజ్యసమితి, వరల్డ్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్), కొలంబియా యూనివర్సిటీ, ఇంటర్నేషనల్ యూత్ కాన్ఫరెన్స్‌లో విద్యార్థులు పాల్గొన్నారని వివరించారు. 'ఆణిముత్యాలు' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన 126 మంది విద్యార్థులను గుర్తించి వారికి పోటీపరీక్ష నిర్వహించామని తెలిపారు. విద్యార్థుల భాషా పరిజ్ఞానాన్ని పరిశీలించి అమెరికా పర్యటనకు 10 మందిని ఎంపిక చేశామని సీఎంకు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం.. అమెరికా పర్యటన ఎలా జరిగిందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, కమిషనర్ సురేష్ కుమార్, పాఠశాలల మౌలిక వసుతుల కమిషనర్ కాటమనేని భాస్కర్, సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు, మధ్యాహ్న భోజనం డైరెక్టర్ నిధి మీనా, ఉత్తర అమెరికాలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పండుగాయల రత్నాకర్, ఐక్యరాజ్యసమితి సభ్యులు ఉన్నవ షకిన్ కుమార్, మంగ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కమలం సర్కార్‌ను తెద్దాం

తెలంగాణ రాష్ట్రంలో పసుపు సాగు అధికంగా ఉన్న దృష్ట్యా ఇక్కడ జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేయడం ఆ రైతుల అభ్యున్నతికి దోహద పడుతుందని తెలిపారు. కృష్ణా జలాల వివాదాన్ని ఇటీవల కేంద్ర కేబినెట్‌లో చర్చించి తెలంగాణలో నీటి సమస్య తీర్చేవిధంగా మోదీ సర్కార్ నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కూడా కేంద్ర సర్కార్ సఫలీకృతమైందని చెప్పారు. ఎన్నికలు వచ్చాయంటే కాంగ్రెస్ వాళ్లు కొత్త బట్టలు వేసుకొని వస్తారని, ఇటీవల రాహుల్ బాబా ఏదేదో చేస్తామని చెబుతూ తిరుగుతున్నారని అమిత్ షా విమర్శించారు. ఆదివాసీల సంక్షేమం కోసం యూపీఏ ప్రభుత్వం 2013%--%14లో రూ.24 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తే, ప్రస్తుతం మోదీ ప్రభుత్వం రూ.1.24 లక్షల కోట్లు కేటాయించిందని చెప్పారు. ఆ ప్రభుత్వ హయాంలో రూ.12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, కానీ తమపై అవినీతి ఆరోపణలు చేసే అవకాశం కూడా లేకుండా పోయిందని అన్నారు. ఆర్టికల్ 370 తొలగించడం ద్వారా కశ్మీర్‌ను భారతదేశంలో అంతర్భాగంగా చేశామని చెప్పారు. వచ్చే జనవరిలో అయోధ్యలో భవ్య రామమందిర్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు.

**కేసీఆర్‌కు ఏమైందో చెప్పాలి: సంజయ్**

అమిత్‌షా ప్రసంగానికంటే ముందు కిషన్‌రెడ్డి మాట్లాడేందుకు సిద్ధమయ్యారు. కానీ గొంతు బొంగురు పోవడంతో ఆగిపోయారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ మాట్లాడుతున్నప్పుడు సభలో జనం నుంచి విశేష స్పందన కనిపించింది. బీజేపీ ఎన్నికల యుద్ధాన్ని ప్రారంభించిందని, సైరన్ మోగించామని, కార్యకర్తలు సిద్ధం కావాలని సంజయ్ పిలుపునిచ్చారు. సీఎం గత కొన్ని రోజులుగా కనిపించడం లేదని, ఆయనకు ఏమైందో చెప్పాలని కేటీఆర్‌ను డిమాండ్ చేశారు. కేసీఆర్ సార్‌కు రక్షణ కల్పించాలని, ఆయన విషయంలో తనకు ఆందోళనగా ఉందని అన్నారు.ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత రాష్ట్రంలో బీజేపీ నిర్వహించిన మొట్టమొదటి బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ప్రసంగం ప్రారంభించే ముందు రెండు చేతులు పైకెత్తిన అమిత్‌షా.. కేసీఆర్‌ను మార్చివేసి, మోదీ సర్కార్‌ను తెచ్చేందుకు పిడికిలి బిగించాలంటూ పిలుపునిచ్చారు. అనంతరం 'భారత్ మాతాకీ జై'అంటూ ఆయన చేసిన నినాదానికి సభికుల నుంచి విశేష స్పందన వచ్చింది.సభలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాం అహిర్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎంపీలు వివేక్ వెంకటస్వామి, రమేష్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆత్మహత్యలు,అకృత్యాల్లోనే నంబర్ వన్‌ఈ పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం పేదలు, రైతులు, దళితులు, ఆదివాసీలు, బడుగు, బలహీన వర్గాల కోసం చేసిందేమీ లేదని అమిత్ షా ధ్వజమెత్తారు.కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చేయడం ఎలా? అనే ఒక చింత తప్పితే కేసీఆర్‌కు మరొకటి లేదన్నారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం అన్నింటిలో నంబర్ వన్‌గా ఉందనే ఒక అబద్ధపు ప్రచారం చేస్తూ ప్రయోజనం పొందాలని చూస్తున్నారని, అయితే రైతుల ఆత్మహత్యలు, మహిళలపై అకృత్యాలు, అవినీతిలో మాత్రమే ఈ ప్రభుత్వం నంబర్ వన్‌గా ఉందని ఆరోపించారు.



# కులగణన అంటే ఎక్స్‌రే

(మొదటి పేజీ తరువాయి)

'గాయపడిన' ఓబీసీలు, దళితులు, గిరిజనుల స్థితిగతులను కులగణన వెలుగులోకి తీసుకొస్తుందని తెలిపారు. మంగళవారం మధ్యప్రదేశ్‌లోని శహడోల్ జిల్లా బ్యోహరీలో జరిగిన ఎన్నికల సభలో ఆయన ప్రసంగించారు. ఏది ఏమైనా.. అసలు నిజాలు తెలుసుకునేందుకు కులగణన జరిపేలా కేంద్రప్రభుత్వంపై కాంగ్రెస్ ఒత్తిడి తెచ్చి తీరుతుందన్నారు. ప్రధాని మోదీ ఈ అంశంపై ఎందుకు మాట్లాడరని నిలదీశారు. కాంగ్రెస్ చేపట్టిన కులగణన డేటా బయటపెట్టాలని ఆయన్ను సవాల్ చేశామని.. ఆయన దాని గురించి మాట్లాడకుండా ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ గురించి మాట్లాడతారని ఎద్దేవాచేశారు. రాజస్థాన్, కర్ణాటక, ఛత్తీసగఢ్‌లలోని తమ ప్రభుత్వాలు ఈ ప్రక్రియను ప్రారంభించాయని తెలిపారు. అధికారంలోకి వచ్చాక మధ్యప్రదేశ్‌లో కూడా జరుపుతామన్నారు. బీజేపీ, ఆర్‌ఎసఎసలకు మధ్యప్రదేశ్ ప్రయోగశాలగా మారిందని.. బీజేపీ అగ్ర నేత అద్వాణీ తన పుస్తకంలో ఈ మాట చెప్పారని రాహుల్ తెలిపారు. 'మధ్యప్రదేశ్ పలు కుంభకోణాల ప్రయోగశాల. ఇక్కడ చనిపోయినవారికి కూడా వైద్యం చేసిన కుంభకోణం బయటకు వచ్చింది. బీజేపీ ప్రభుత్వం శివుడిని కూడా వదల్లేదు. ఉజ్జయిని మహాకాళేశ్వర ఆలయం వద్ద మహాకాల్‌లోక్ కారిడార్ అభివృద్ధిలో అవకతవకలకు పాల్పడింది' అన్నారు.

# 2050 నాటికి బ్రెయిన్ స్ట్రోక్‌లు 50% పెరుగుతాయ్

(మొదటి పేజీ తరువాయి)

అలాగే మరణాల సంఖ్య కూడా ఏడాదికి 97 లక్షలకు చేరుకుంటుందని లాన్సెంట్ న్యూరాలజీ జర్నల్‌లో ప్రచురితమైన కొత్త అధ్యయనం వెల్లడించింది. స్ట్రోక్ వల్ల పెరుగుతున్న ఆరోగ్య, ఆర్థిక ప్రభావాలను ఈ అధ్యయనం విశ్లేషించింది. ఇది ఎక్కువగా తక్కువ, మధ్య ఆదాయ దేశాలను ఎక్కువగా ప్రభావం చేస్తుందని గుర్తించింది. ఇటీవల నమోదవుతున్న కేసులు, సర్వేలు, ప్రపంచవ్యాప్తంగా న్యూరాలజీ నిపుణులతో ఇంటర్వ్యూలు, సమీక్షల ఆధారంగా పరిశోధకులు ఈ అంచనా వేశారు. స్ట్రోక్ గురై చనిపోయినవారు, పక్షవాతానికి గురై బాధపడేవారి సంఖ్య గత 30 ఏళ్లలో రెట్టింపైందని తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లో ఈ బాధితులు ఎక్కువ మంది ఉన్నారని గుర్తించారు. 'బ్రెయిన్ స్ట్రోక్ అనేది ప్రపంచ జనాభాపై విపరీతమైన ప్రభావాన్ని చూపిస్తుంది. ఇది ప్రతి ఏడాదీ లక్షలాది మంది మరణానికి, శాశ్వత వైకల్యానికి కారణమవుతుంది. దీని చికిత్సకు కూడా లక్షలు ఖర్చుచేయాల్సి వస్తోంది' అని పరిశోధకుల్లో ఒకరైన ప్రొఫెసర్ వాలెరీ ఎల్ ఫీగిన్ చెప్పారు.

# రింగ్ రోడ్డు ప్రశ్న ఒకటే!

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం తాడేపల్లి సమీపాన కుంచనపల్లిలోని సిట్ కార్యాలయంలో సీఐడీ అధికారుల ఎదుట విచారణకు ఆయన హాజరయ్యారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకూ సుమారు ఆరున్నర గంటలపాటు ఆయన్ను ప్రశ్నించారు. ఈ కేసులో ఆయన్ను 14వ నిందితుడిగా చేర్చిన సీఐడీ అధికారులు.. సెక్షన్ 41ఏ కింద నోటీసు ఇచ్చి విచారణకు హాజరు కావాలని కొన్నిరోజుల క్రితం లోకేశ్‌ను కోరారు. తన న్యాయవాది గింజుపల్లి సుబ్బారావుతో కలిసి మంగళవారం సీఐడీ అధికారుల ఎదుట హాజరయ్యారు. విచారణ తర్వాత సిట్ కార్యాలయం వద్ద లోకేశ్ మీడియాతో మాట్లాడారు. 'నన్ను 50 ప్రశ్నలు అడిగారు. ఇందులో ఒకటి మాత్రమే ఇన్నర్ రింగ్‌రోడ్డుకు సంబంధించింది. మిగిలిన 49 సంబంధం లేనివి. నేను టీడీపీలో, హెరిటేజ్ కంపెనీలో, ప్రభుత్వంలో నిర్వహించిన పదవుల గురించి అడిగారు. ఈ వివరాలన్నీ గూగుల్‌లో కనిపించేవే. మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో ఐఆర్‌ఆర్ ఎలైన్‌మెంట్ గురించి వచ్చిందా అని అడిగారు. రాలేదని చెప్పాను. ఇంకా అడగాల్సినవి ఉన్నాయన్నారు. ఈ రోజు గంటైనా.. రెండు గంటలైనా ఉండి చెప్పడానికి సిద్ధంగా ఉన్నానన్నాను. కానీ రేపు రావాలని కోరారు. వేరే పని ఉందని చెప్పినా రేపే రావాలంటూ మళ్లీ 41ఏనోటీసు ఇచ్చారు. రేపు మళ్లీ ఉదయం 10గంటలకు సీఐడీ అధికారుల ముందు హాజరవుతున్నాను' అని తెలిపారు. తమకు సహకరించినందుకు విచారణాధికారి ధన్యవాదాలు తెలిపారని వ్యాఖ్యానించారు. సీఐడీ వద్ద ఏ స్టేట్‌మెంట్ మీదా సంతకాలు చేయలేదన్నారు.

**ఏ ఆధారాలూ చూపించలేదు..**

ఇన్నర్ రింగ్ రోడ్డు ఎలైన్‌మెంట్ ఉద్దేశపూర్వకంగా మార్చారని కేసు పెట్టిన సీఐడీ అధికారులు.. అందులో తన పాత్రకు సంబంధించిన ఏ ఆధారాన్నీ చూపించలేదని లోకేశ్ చెప్పారు. 'పోలవరం ప్రాజెక్టు నాశనం, అమరావతి విధ్వంసం, నిరుద్యోగులకు ఉద్యోగావకాశా లు లేకుండా చేయడం, ప్రశ్నించిన ప్రజలపై దొంగ కేసులు పెట్టడంపై నిలదీసినందుకు చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉంచారు. ఈ కేసులు లేకపోతే పాదయాత్రలో ఉండేవాడిని.

# పేదలకు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అండగా నిలుస్తున్న వివేరా హాస్పిటల్

**▸▸ హాస్పిటల్ లో ఆడపిల్ల జన్మిస్తే 50% తగ్గింపు ▸▸ ప్రశంసలందుకుంటున్న వివేరా హాస్పిటల్**

**▸▸ కార్పొరేట్ హాస్పిటల్లకు దీటుగా వైద్య సేవలు**




**ఎల్బీనగర్ సమ సమాజం:** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని వివేరా హాస్పిటల్‌లో హాస్పిటల్ ప్రారంభోత్సవం రోజున ఇచ్చిన హామీ ప్రకారం ఆడపిల్ల జన్మిస్తే ఫీజు చెల్లింపులో 50% తగ్గింపు అనే నిర్ణయం పై ఈనెల 7వ తేదీన వలిగొండ మండలం వరకట్పల్లి గ్రామానికి చెందిన నవీన్ రెడ్డి, శివాని(26) దంపతులకు ఆడపిల్ల జన్మించింది. వారికి హాస్పిటల్ సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా శివాని దంపతులు మాట్లాడుతూ వివేరా హాస్పిటల్ యజమాన్యం సేవలు అభినందనీయమని కొనియాడారు. ఆడపిల్ల జన్మిస్తే 50% తగ్గింపు అనేది ఎక్కడ కూడా లేదని కాబట్టి ప్రజలందరూ వివేరా హాస్పిటల్ సేవలు వినియోగించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అనంతరం హాస్పిటల్ ఎండి వీరా చౌదరి,వినయ్ మాట్లాడుతూ మా హాస్పిటల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. నిపుణులైన వైద్య బృందంచే వైద్యం అందించబడుతుందని అన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలు మా హాస్పిటల్ లో ఉన్నాయని తెలిపారు. మా హాస్పిటల్ లో ఆడపిల్ల జన్మిస్తే 50% తగ్గింపు అనేది ఎల్లవేళలా కొనసాగిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ ఉపేందర్, నాగబాబు, జనరల్ ఫిజీషియన్ యమునా, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎవరెన్ని కుట్రలు పన్నినా..బరిలో నిలిచేది నేనే..గెలిచేది నేనే

**ప్రజా చైతన్య యాత్రకు వస్తున్న ఆదరణ తట్టుకోలేక అసత్య ప్రచారాలు**

**ఎలక్షన్ కోడ్ తోనే ప్రజా చైతన్య యాత్రకు బ్రేక్..2, 3రోజుల్లో ప్రారంభం**

**కార్యకర్తలు అధైర్య పడొద్దు అండగా నేనున్నా**

**టిపిసిసి ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి**



**చౌటుప్పల్ సమ సమాజం:** ప్రజల్లో ఆదరణ చూసి ఓర్వలేక.. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా.. మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను బరిలో నిలవడం ఖాయమని.. తాను ఘన విజయం సాధించి మునుగోడు గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం బస్టాండ్ ఆవరణలో రాజీవ్ స్మారక్ భవన్ లో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్భంగా చలమల్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజా చైతన్య యాత్రలో ప్రజల నుంచి తనకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అసత్య ప్రచారాలకు శ్రీకారం చుట్టారన్నారు. తనకు టికెట్ ఇస్తే, కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ముందే ఊహించిన బీఆర్ఎస్, బిజెపి పార్టీలు మునుగోడు టికెట్ సిపిఐ పార్టీకి వెళ్తుందని దుష్ప్రచారానికి తెర లేపారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణను సహించలేక, కార్యకర్తలను ఆందోళన గురి చేయడానికి రెండు పార్టీలు కలిసి పన్నిన పన్నాగమని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధైర్యపడొద్దని, అసత్య ప్రచారాలను నమ్మి కుంగిపోవద్దని మనోధైర్యం చెప్పాడు. సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సీఎల్పీ నేత బట్టి విక్రమార్కలు ఖండించాలని గుర్తు చేశారు. నియోజకవర్గం సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, వాటిని చెడగొట్టే విధంగా ప్రత్యర్థులు సామాజికమధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. మునుగోడు ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి తాను బలిలోకి దిగడం ఖాయమన్నారు. ఎన్నికల్లో ఘనవిజయం సాధించి మునుగోడు గడ్డమీద కాంగ్రెస్ జెండాను ఎగరవేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఎలక్షన్ కోడ్ కారణంతోనే ప్రజా చైతన్య యాత్రకు బ్రేక్ పడిందని, 2, 3రోజుల్లోనే తిరిగి ప్రజా చైతన్య యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు నరసింహ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాదగోని శేఖర్ గౌడ్, ఎన్ ఎస్ యు ఐ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, నాయకులు కేతరాజు అచ్చయ్య, బత్తుల శ్రీహరి, పందుల రాజేష్, పాలమాకుల యాదయ్య, ఎంప ఖయ్యూం, దోర్నాల శ్రీనివాస్, ఢిల్లీ చంద్రకళ, అబ్బాస్ బేగం, యాస నరసింహారెడ్డి, లగ్గోని వెంకటేశం, ఎర్ర విక్రమ్, ఢిల్లీ శేఖర్ రెడ్డి, దొనకొండ కృష్ణ, కందగట్ల చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బీబీనగర్ మండల ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం



**బీబీనగర్ సమ సమాజం:** బి ఆర్ ఎస్ పార్టీ బిబినగర్ మండల ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించిన భువనగిరి శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్క ఓటరుకు తెలియజేసి ముఖ్యంగా గ్రామ గ్రామాల్లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి మళ్ళీ భువనగిరి ఖిల్లా పై అత్యధిక మెజారిటీ తో గులాబీ జెండా ఎగురవేసి ముఖ్యమంత్రి కి కానుకగా ఇవ్వాలన్నారు. ఈనెల 16 న భువనగిరి పట్టణంలో సీఎం కేసీఆర్ అధ్యక్షతన నిర్వహించే ప్రజాశీర్వద సభకి బిబినగర్ మండలం నుండి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



# చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ

**గూడూరు ,సమ సమాజం:** గూడూరు మండల భూపతి పేట చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా డీసీఎం వ్యాన్ నెంబర్ %ూాజూ% 36 తా 9988 ను ఆపి చెక్ చేయగా డ్రైవర్ రాజ్ కుమార్ తండ్రి. చెన్నయ్య యాదవ్ డ్రైవర్ పోనుగోడు ఇతని వద్ద 4.45.000 రూపాయలు ఉన్నవి ఎలక్షన్ కోడ్ లో భాగంగా ఇతని వద్ద ఉన్న డబ్బులకు సరైన ఆధారాలు లేని కారణంగా సీజ్ చేయడం జరిగింది. గూడూరు ప్రజలకు పోలీసు వారి విజ్ఞప్తి ఎవరైనా వ్యక్తులు 50 వేల రూపాయల కంటే ఎక్కువ తీసుకొని ప్రయాణం చేసినట్లు అయితే సరైన ఆధారాలు పెట్టుకోవలెను లేనియెడల డబ్బులను సీట్ చేయడం జరుగుతుందని గూడూర్ ఎస్సై రాణా ప్రతాప్ తెలిపారు.

## వాట్సాప్ గ్రూప్ లలో దూషణలకు పాల్పడితే చర్యలు



**గూడూరు ,సమ సమాజం:** రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున సోషల్ మీడియాలో ఎలాంటి వివాదాస్పందన వాక్యాలు చేయకూడదని గూడూర్ మండల ప్రజలకు రాజకీయ నాయకులకు యూత్ సంఘాలకు సూచించారు రాజకీయ పార్టీలకు అనుకూలంగా గాని ప్రతికూలంగా గాని పోస్టులు పెట్టకూడదని వాట్సాప్ గ్రూప్ లలో వ్యక్తిగత దూషణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రానా ప్రతాప్ తెలిపారు.

# సర్పంచి కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా కోఆప్షన్ నెంబర్ ఖాసిం



**గూడూరు సమ సమాజం:** గూడూరు మండలం హనుమాన్ తండా గ్రామపంచాయతీ సర్పంచ్ జాటోత్ జ్యోతి ఉమ్లా నాయక్ వారి తండ్రి బిచ్చ నాయక్ నిన్న అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన జిల్లా పరిషత్ కో ఆప్షన్ నెంబర్ మహమ్మద్ ఖాసిం మీరు వెంట మట్టెవాడ గ్రామ సర్పంచ్ ఈసం సంధ్య సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ రేఖ, వెంకటేశ్వర్లు, విద్య, నరసయ్య, మంగు నాయక్, బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ యుఐ గ్రామ కమిటీ ఎన్నిక



**నూతనకల్ సమ సమాజం::** సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ,ఎన్ఎస్ యుఐ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కందుకూరి అంబేద్కర్ ఆదేశాల మేరకు నూతనకల్ మండల ఎన్ఎస్ యుఐ నూతనకల్ మండల అధ్యక్షులు ఉప్పుల మురళి యాదవ్ మంగళవారం ఎర్రపహాడ్ గ్రామ శాఖ ఎన్ఎస్ యుఐ కమిటీని ఎన్నిక చేశారు. అధ్యక్షుడుగా జలగం గౌతం, ఉపాధ్యక్షుడుగి సూరారపు మహేష్, ప్రధాన కార్యదర్శిగా కొమ్ము మహేష్ ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనాటి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు లింగాల రామచంద్రయ్య, సర్పంచ్ గుర్రం సత్యనారాయణ నూతనకల్ మండలం ఎన్ఎస్ యుఐ కోఆర్డినేటర్ మరికంటి అశోక్,జలగం యోగానందం, పిఎసిఎస్ డైరెక్టర్ పసుల వెంకన్న, లింగాల వెంకన్న,లింగాల సత్తయ్య, చిర్ర శ్రీనాథ్, గ్రామ వార్డు నెంబర్ నారగాని యాకస్వామి, పసుల మన్నెమ్మ ,సుధాకర్ , అనంతుల సోమయ్య, గ్రామ యూత్ కాంగ్రెస్ నాయకులు అనంతుల మహేష్ పాల్గొన్నారు.

# భువనగిరి లో సీఎం కెసిఆర్ ప్రజా ఆశీర్వాద సభ

**భువనగిరి సమ సమాజం:** ఈనెల 16 న భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాదసభ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు సూచించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో బిఆర్ఎస్ భువనగిరి మండల పార్టీ అధ్యక్షుడు జనగాం పాండు, మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, భువనగిరి టౌన్ అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి ఏ.కిరణ్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్బగాని వెంకట్ గౌడ్, ఎంపీటీసీ రాసాల మల్లేష్, నర్సింగ్, పోల్ల ప్రవీణ్ కుమార్ గౌడ్, జనగా మహేష్, పల్లెపాటి రవికుమార్,(కొండల్) నాగారం సూరజ్, శ్యామల చందు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పరశురాములు



**నూతనకల్ అక్టోబర్ 10:పృధ్వి న్యూస్ :** ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండల పరిధిలోని వెంకేపెల్లి గ్రామానికి చెందిన పాల్వాయి పరశురాములు ఎన్నికయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన ఎంఆర్ పిఎస్ జిల్లా సమావేశంలో జిల్లా కమిటీ లను ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ ఎస్సీలకు కల్పించిన రిజర్వేషన్లు సమానంగా దక్కాలంటే ఎస్సీ వర్గీకరణ చేయక తప్పదు అని, ఎస్సీ వర్గీకరణ కోసం కోసం మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం జరుగుతుందని, జిల్లాలో ఎమ్మార్పీఎస్ బలోపేతం కొరకు కృషి చేస్తానని తెలిపారు.

# వేముల కొండ మండల ఏర్పాటు పై హర్షం

**ఎమ్మెల్యే ను కలిసిన 10 గ్రామాల ప్రజలు**



**భువనగిరి అక్టోబర్ సమ సమాజం:** భువనగిరి నియోజకవర్గం వలిగొండ మండలం నుండి వేములకొండ, అరూర్, గంగాపూర్, వెంకటాపూర్, ముద్దాపూర్, చిట్టాపూర్, గోపరాజు పల్లి, దుప్పల్లి, నర్సాపూర్ గ్రామాలను వేరు చేసి నూతన మండలంగా మత్స్యాద్రి వేములకొండ అరూర్ మండలంగా ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి కృషితో సీఎం కేసీఆర్ ప్రకటించినందుకు ఆయా గ్రామాల సర్పంచులు, రామన్నపేట వలిగొండ మార్కెట్ చైర్మన్ పైళ్ల రాజా వర్ధన్ రెడ్డి పిఎసిఎస్ చైర్మన్లు సురకంటి వెంకట్ రెడ్డి చిట్టెడీ వెంకట్ రామ్ రెడ్డి ఎంపిటిసిలు గ్రామ శాఖ అధ్యక్షులు వార్డు సభ్యులు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు, గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ని కలిసి ఘనంగా సన్మానించి హర్షం వ్యక్తం చేశారు.



# ముదిరాజ్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నారబోయిన రవి ముదిరాజ్

**మునుగోడు అక్టోబర్ సమ సమాజం:** నల్లగొండ జిల్లా ముదిరాజ్ సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. మునుగోడు నియోజకవర్గ పరిధిలో ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం జరుపుటకు సన్నాహక కమిటీ ఏర్పాటు చేయటం కొరకు 11 అక్టోబర్ 2023 రోజున మధ్యాహ్నం 2.00 గంటలకు చిన్న వెంకటరెడ్డి ఫంక్షన్ హాల్ నలగొండ లో నల్లగొండ జిల్లా ముదిరాజ్ సంఘం ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేయనైనది. కావున అన్ని గ్రామాల, మండలాల ముఖ్య నాయకులు ప్రజా ప్రతినిధులు, సర్పంచులు మొదలగువారు పార్టీలకు సంబంధం లేకుండా హాజరు కావాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్ల సోమ మల్లయ్య ముదిరాజ్ కోరినారు. ఈ సమావేశంలో పందిరి శ్రీనివాస్ ముదిరాజ్, కావలి ఆంజనేయులు ముదిరాజ్, ఈటెల వెంకటేశ్వర్లు ముదిరాజ్, నారబోయిన రవి ముదిరాజ్, బోళ్ల వెంకట్ ముదిరాజ్, లోకనబోయిన రమణ ముదిరాజ్, నాశ బోయిన వెంకటేశ్వర్లు ముదిరాజ్, సంగెపు సురేష్ ముదిరాజ్, కట్టా సుధాకర్ ముదిరాజ్, పందిరి దినేష్ కుమార్ ముదిరాజ్, తలారి యాదగిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# టాప్‌పైనే దృష్టి

▶▶ మరో గెలుపు లక్ష్యంగా భారత్ ▶▶ నేడు అఫ్ఘానిస్థాన్‌తో పోరు ▶▶ మ.2 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

న్యూఢిల్లీ: టాపార్డర్ వైఫల్యం కారణంగా స్వల్ప ఛేదనలో ఆసీసపై భారత్‌కు పోరాడి గెలవాల్సిన పరిస్థితి ఎదురైంది. ఈనేపథ్యంలో బుధవారం టీమిండియా తమ రెండో మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్‌తో తలపడనుంది. ఆసీసతో ఆరంభంలోనే కీలక వికెట్లు కోల్పోయిన వేళ విరాట్, రాహుల్ అద్భుత బ్యాటింగ్‌తో ఆదుకున్నారు. రోహిత్ కూడా మిడిలార్డర్ సత్తా తెలుసుకునేందుకు ఇలాంటి సవాల్‌నే కోరుకున్నట్టు చెప్పాడు. టోర్నీలో తొమ్మిది విభిన్న వేదికలపై ఆడాల్సి ఉండడంతో ఎలాంటి పరిస్థితి ఎదురైనా దీటుగా ఎదుర్కొనేందుకు బ్యాటర్లు సిద్ధంగా ఉండాలని సూచించాడు. అయితే ఈ మ్యాచ్‌లో మాత్రం ఎలాంటి తడబాటు లేకుండా ప్రత్యర్థిపై విరుచుకుపడాలని టీమ్ భావిస్తోంది. అదే జరిగితే తర్వాత పాక్‌తో జరిగే మ్యాచ్‌కు ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగవచ్చు. ఇక చెపాక్‌లో స్పిన్ ట్రాక్ ఎదురుకాగా.. ఢిల్లీ వికెట్‌పై మాత్రం పరుగుల వరదే పారనుంది. ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 428 పరుగులు చేస్తే, శ్రీలంక 326 రన్స్‌తో దీటుగా బదులిచ్చిన విషయం తెలిసిందే. మొత్తంగా 754 పరుగులతో స్టేడియం హోరెత్తింది. అదే రీతిన రోహిత్ సేన విజృంభిస్తే అభిమానులకు పండగే. ఈ మెగా టోర్నీ (2019)లో ఇరు జట్ల మధ్య కేవలం ఒక్క మ్యాచే జరగ్గా అతికష్టమ్మీద భారత్ గెలిచింది.

**అశ్విన్ స్థానంలో షమి!:**

ఊహించినట్టుగానే ఈ మ్యాచ్‌కు కూడా ఓపెనర్ గిల్ దూరమ్యాడు. దీంతో ఇషాన్, రోహిత్ ఓపెనర్లుగా రానున్నారు. అయితే ఆసీసపై ఇషాన్‌తో పాటు శ్రేయాస్ షాట్ల ఎంపిక కూడా విమర్శలకు దారితీసింది. గిల్ తదుపరి మ్యాచ్‌లపై కూడా సందేహం నెలకొన్న వేళ.. ఇషాన్ బాధ్యతాయుతంగా ఆడాల్సి ఉంది. శ్రేయాస్ కుదురుకుంటే అతడిని ఆపడం ప్రత్యర్థి బౌలర్లకు కష్టమే. పైగా ఐపీఎల్‌లో ఢిల్లీ కెప్టెన్‌గా అతడికి ఈ మైదానం అలవాటే. ఏదేమైనా ఈ చిన్న జట్టుపై టాపార్డర్ ట్రాక్‌లోకి వస్తే ఎలాంటి ఒత్తిడీ ఉండదు. ఆసీస్ బౌలర్లతో పోలిస్తే అఫ్ఘాన్ బౌలింగ్ భారత బ్యాటర్లకు అంతగా ఇబ్బంది పెట్టకపోవచ్చు. చివరి మ్యాచ్‌లో ఏకంగా 31 సిక్సర్లు నమోదయ్యాయి. సొంత మైదానంలో విరాట్ కోహ్లీ నుంచి మరోసారి సూపర్ షోను ఆశిస్తున్నారు. అలాగే ఆసియాకప్ నుంచి సరికొత్త రాహుల్ కనిపిస్తున్నాడు. ఇక పిచ్ స్పిన్‌కు అనుకూలించే అవకాశం లేకపోవడంతో అశ్విన్ స్థానంలో పేసర్ షమికి చోటు దక్కవచ్చు. హార్దిక్ నాలుగో పేసర్‌గా ఉంటాడు.

అఫ్ఘాన్ జట్టుకు ప్రధానంగా స్పిన్నర్లు వెన్నుదన్నుగా నిలుస్తున్నా.. బ్యాటర్లు తమ సత్తా నిరూపించుకోవాల్సి ఉంది. బంగ్లాపై కేవలం 156 పరుగులకే ఆలౌట్ కావడం గమనార్హం. ఓపెనర్ రహ్మతుల్లా గుర్బాజ్ మాత్రం ఫామ్‌ను కనబరుస్తున్నా, మిగతా బ్యాటర్ల నుంచి సహకారం కరువైంది. ఈనేపథ్యంలో భారత్‌కు ఎలాంటి పోటీనిస్తుందో వేచిచూడాల్సిందే. అయితే రషీద్ టీ20ల్లో మాదిరి ఈ ఫార్మాట్‌లో ప్రమాదకరంగా కనిపించడం లేదు. తొలి మ్యాచ్‌లో 9 ఓవర్లు వేసినా వికెట్ తీయలేకపోయాడు. పోటీ ఇచ్చేనా..?

**తుది జట్లు (అంచనా)**

భారత్: రోహిత్ (కెప్టెన్), ఇషాన్, విరాట్, శ్రేయాస్, రాహుల్, హార్దిక్, జడేజా, కుల్దీప్, షమి/అశ్విన్, బుమ్రా, సిరాజ్.

అఫ్ఘాన్: గుర్బాజ్, జద్రాన్, రహ్మత్ షా, హస్మతుల్లా షాహిది (కెప్టెన్), నజీబుల్లా, నబీ, అజ్మతుల్లా, రషీద్, ముజీబుర్, నవీన్ ఉల్ హక్, ఫజల్‌హక్.

**పిచ్, వాతావరణం**

వేడి వాతావరణం కొనసాగనుంది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. ఇక్కడ జరిగిన చివరి ఆరు వన్డేల్లో మొదట బ్యాటింగ్ చేసిన జట్లే ఐదుసార్లు గెలిచాయి.

డెంగీ నుంచి కోలుకొంటున్న ఓపెనర్న్యూఢిల్లీ: వరల్డ్‌కపనకే హైలైట్ మ్యాచ్ ఇండో–పాక్ పోరుకు టీమిండియా ఓపెనర్ శుభ్‌మన్ గిల్ దూరమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. డెంగీ జ్వరం బారినపడిన గిల్ క్రమంగా కోలుకొంటున్నాడు. అతడిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినా మరో వారంపాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించడంతో బుధవారం జరిగే అఫ్ఘాన్ మ్యాచ్‌కు కూడా అందుబాటులో ఉండే అవకాశాలు లేవు. ఈ నేపథ్యంలో శనివారం అహ్మదాబాద్‌లో పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో కూడా ఆడడం కష్టమే. గత వారం డెంగీ పాజిటివ్‌గా తేలడంతో చెపాక్‌లో ఆదివారం ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో గిల్ ఆడలేదు. అదే రోజు రాత్రి ప్లేట్‌లెట్ కౌంట్ 70 వేలకు పడిపోవడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

# 345.. ఉఫ్

**రిజ్వాన్, షఫిక్ శతక మోత**

**ఛేదనలో పాక్ చరిత్ర**

**6 వికెట్లతో లంక చిత్తు**

**మెండిస్, సమరవిక్రమ సెంచరీలు వృథా**

హైదరాబాద్: రిజ్వాన్ (121 బంతుల్లో 131 నాటౌట్), అబ్దుల్లా షఫిక్ (103 బంతుల్లో 113) శతకాలతో అదరగొట్టడంతో.. వరల్డ్‌కపలోనే పాకిస్థాన్ అత్యధిక పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. ఉప్పల్ స్టేడియంలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పాక్ 6 వికెట్ల తేడాతో శ్రీలంకపై ఘన విజయం సాధించింది. తొలుత లంక 50 ఓవర్లలో 9 వికెట్లకు 344 పరుగుల భారీ స్కోరు చేసింది. కుశాల్ మెండిస్ (122), సదీర సమరవిక్రమ (108) సెంచరీలు వృథా అయ్యాయి. హసన్ అలీ 4 వికెట్లు, హరీస్ రౌఫ్ 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో పాక్ 48.2 ఓవర్లలో 345/4 స్కోరు చేసి నెగ్గింది. వన్డేల్లో పాక్‌కు ఇది రెండో అత్యధిక ఛేదన కావడం కూడా విశేషం. రిజ్వాన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. తడబడి.. నిలబడి: భారీ లక్ష్యం కోసం బరిలోకి దిగిన పాక్ ఆదిలోనే తడబడింది. ఓపెనర్ ఇమామ్ (12), కెప్టెన్ బాబర్ (10)ను అవుట్ చేసి మదుషనక షాకిచ్చాడు. ఈ దశలో మరో ఓపెనర్ అబ్దుల్లా షఫిక్, రిజ్వాన్ జట్టు బాధ్యతలను భుజాన వేసుకొన్నారు. వీరిద్దరూ వికెట్ పడకుండా ఆడడంతో తొలి పవర్‌ప్లే ముగిసే సరికి పాక్ 48/2తో నిలిచింది. కాగా, పథిరన బౌలింగ్‌లో హేమంత అందుకొన్న అద్భుత క్యాచ్‌తో షఫిక్ పెవిలియన్ చేరాడు. దీంతో మూడో వికెట్‌కు 176 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ, జోరు కొనసాగించిన రిజ్వాన్.. సౌద్ షకీల్ (31)తో కలిసి 95 రన్స్ జోడించి జట్టును గెలుపు బాటలో నిలిపాడు. 18 బంతుల్లో 20 పరుగులు కావాల్సిన సమయంలో నాలుగు బౌండ్రీలు బాదిన రిజ్వాన్.. మరో 10 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించాడు.

బెంబేలెత్తించిన మెండిస్, సమరవిక్రమ: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న లంక



ఓపెనర్ కుశాల్ పెరీరా (0) వికెట్‌ను వేగంగా చేజార్చుకొన్నా.. మరో ఓపెనర్ నిస్సంక (51), మెండిస్ రెండో వికెట్‌కు 102 పరుగులు జోడించి జట్టును ఆదుకొన్నారు. షాదాబ్ బౌలింగ్ అనవసర షాట్‌తో నిస్సంక వికెట్ పారేసుకొన్నాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన సమరవిక్రమ.. మెండిసతో పోటీ పడి ఆడడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. కానీ, భారీ షాట్ ఆడే క్రమంలో కుశాల్ అవుటయ్యాడు. సమరవిక్రమ తనదైన శైలిలో చెలరేగడంతో 44వ ఓవర్‌లోనే లంక స్కోరు 300 పరుగులు దాటింది.




# బంగ్లాపై కసిగా..

ధర్మశాల: డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ జట్టు తాజా ప్రపంచకప్‌లో బోణీ చేసింది. తొలి మ్యాచ్‌లో కివీస్ చేతిలో కంగుతిన్న ఈ జట్టు మంగళవారం బంగ్లాదేశ్‌పై మాత్రం విరుచుకుపడింది. టాపార్డర్‌లో ఓపెనర్ డేవిడ్ మలాన్ (107 బంతుల్లో 16 ఫోర్లు, 5 సిక్సర్లతో 140) మెరుపు శతకం సాధించగా.. జో రూట్ (68 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 82), బెయిర్‌స్టో (59) అర్ధసెంచరీలు చేశారు. అనంతరం పేసర్ రీస్ టాప్లీ (4/43) ప్రత్యర్థి టాప్ లేపడంతో బట్లర్ సేన 137 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 364 పరుగుల భారీ స్కోరు సాధించింది. మలాన్ తొలి వికెట్‌కు బెయిర్‌స్టోతో కలిసి 115, రెండో వికెట్‌కు రూట్‌తో కలిసి 151 పరుగులు జత చేర్చాడు. మెహిదీ హసన్‌కు నాలుగు, షోరిఫుల్‌కు మూడు వికెట్లు దక్కాయి. అనంతరం భారీ ఛేదనలో టాపార్డర్ వైఫల్యంతో బంగ్లాదేశ్ 48.2 ఓవర్లలో 227 పరుగులకే కుప్పకూలింది. లిట్టన్ దాస్ (76), ముష్ఫికర్ (51), తౌహిద్ (39) మాత్రమే రాణించారు.



# మేమే నెం.1

**సాత్విక్, చిరాగ్ జోడీకి ప్రపంచ టాప్ ర్యాంక్**

**ఈ ఘనత సాధించిన తొలి భారత జోడీగా చరిత్ర**

న్యూఢిల్లీ: ఆసియాడ్‌లో స్వర్ణం సాధించి చరిత్ర సృష్టించిన తెలుగు కుర్రాడు సాత్విక్ సాయిరాజ్, ముంబై షట్లర్ చిరాగ్ శెట్టి మరో అద్భుతం సృష్టించారు. గతంలో ఏ భారతీయ బ్యాడ్మింటన్ జోడీకి సాధ్యం కాని ఘనతను సుసాధ్యం చేసి చూపించారు. ప్రపంచ బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ విభాగంలో నెంబర్ వన్ జంటగా అవతరించారు. మంగళవారం బీడబ్ల్యూఎఫ్ విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ ప్రపంచ నెంబర్ వన్ స్థానాన్ని ఆక్రమించింది. ఆసియా క్రీడల్లో చాంపియన్‌గా నిలవడంతో సాత్విక్ ద్వయం రెండు స్థానాలు ఎగబాకి టాప్ ర్యాంక్‌ను దక్కించుకుంది. ఈ ఇద్దరికీ కెరీర్‌లో ఇదే అత్యుత్తమ ర్యాంక్. అంతేకాదు.. భారత్ తరఫున ఈ ఘనత సాధించిన తొలి డబుల్స్ జోడీగా చరిత్రకెక్కారు. గతంలో ప్రకాశ్ పదుకోన్, సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్ వన్ ర్యాంక్‌లో నిలిచారు. పురుషుల డబుల్స్‌లో మాత్రం ఈ అరుదైన రికార్డును సాత్విక్ జంట ఖాతాలో వేసుకుంది. 92,411 పాయింట్లతో సాత్విక్, చిరాగ్ జోడీ టాప్‌లో నిలవగా.. 90,129 పాయింట్లతో ఇండోనేసియా జంట అల్ఫియాన్, అర్డియాంటో రెండో ర్యాంక్‌లో ఉంది. ఇక, మహిళల సింగిల్స్‌లో సింధు రెండు స్థానాలు మెరుగై 13వ ర్యాంక్‌ను అందుకుంది. ఇక ప్రణయ్ ఓ స్థానం కోల్పోయి 8వ ర్యాంక్‌లో నిలిచాడు. లక్ష్యసేన్ 15, కిడాంబి శ్రీకాంత్ 20వ ర్యాంకుల్లో కొనసాగుతున్నారు. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీ జంట ఓ స్థానం పైకెక్కి 16వ ర్యాంక్‌లో ఉంది.

అసాధ్యులు కొన్నాళ్లుగా అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో నిలకడగా రాణిస్తున్న సాత్విక్, చిరాగ్.. ఇటీవలి కాలంలో సూపర్ ఫామ్‌తో దూసుకెళ్తోంది. గతేడాది కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం, ప్రపంచ చాంపియన్‌షిపలో కాంస్యం నెగ్గిన ఈ జంట.. ఈ ఏడాది మార్చిలో స్విస్ ఓపెన్, ఏప్రిల్‌లో ఆసియా చాంపియన్‌షిపలో స్వర్ణం సాధించింది. జూన్‌లో ఇండోనేసియా ఓపెన్ టైటిల్‌తో బీడబ్ల్యూఎఫ్ సూపర్ 1000 టోర్నమెంట్ నెగ్గిన మొదటి భారత జంటగా రికార్డుకెక్కిన సాత్విక్, చిరాగ్.. ఆ వెంటనే కొరియా ఓపెన్ సూపర్ 500 టైటిల్‌తో ర్యాంకింగ్స్‌లో ఏకంగా రెండో స్థానానికి ఎగబాకింది. మళ్లీ ఇప్పుడు ఆసియాడ్ ట్రోఫీతో శిఖరాగ్రాన నిలిచింది. హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్న సాత్విక్, చిరాగ్ జోడీ కెరీర్ ఎదుగుదలలో షట్లర్ల తల్లిదండ్రుల పాత్రతో పాటు కోచ్‌ల పాత్ర కీలకం. జాతీయ చీఫ్ కోచ్ గోపీచంద్ పర్యవేక్షణలో, డబుల్స్ కోచ్ మథియాస్ బో ఆధ్వర్యంలో వీరిద్దరూ అద్భుతంగా రాటుదేలారు. డెన్మార్క్‌కు చెందిన మథియాస్ ఒకప్పుడు డబుల్స్‌లో ప్రపంచ నెంబర్‌వన్‌గా నిలిచాడు. టోక్యో ఒలింపిక్స్‌కు ముందు మథియాస్ భారత జట్టుకు డబుల్స్‌లో తాత్కాలిక కోచ్‌గా పనిచేశాడు. అయితే, ఆ తర్వాత కొన్నాళ్లపాటు డబుల్స్ షట్లర్లకు కోచ్ లేదు. దీంతో ఆటగాళ్ల ప్రదర్శనలో కూడా మెరుగుదల లేకపోవడంతో జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య (బాయ్) మళ్లీ మథియాసను పిలిపించింది. గతేడాది ఏప్రిల్‌లో మథియాస్ తిరిగి రావడంతో సాత్విక్, చిరాగ్ ఆటతీరులో అనూహ్యమైన మార్పు కనిపించింది. ఎండ్‌గేమ్‌లో తమకు క్లిష్టంగా మారిన ఆటను మెరుగుపరచుకోవడంలో మథియాస్ సూచనలు, సలహాలు అద్భుతంగా పని చేశాయి. దీంతో సాత్విక్, చిరాగ్ అనతికాలంలోనే వరుస విజయాలతో రికార్డులు, టైటిళ్లు కొల్లగొట్టారు. స్వల్ప వ్యవధిలోనే నెంబర్‌వన్ ర్యాంకర్లుగా ఎదిగి అసాధ్యులు అనిపించుకున్నారు. ఇదే దూకుడు, ఆటను కొనసాగిస్తే వచ్చే ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించాలన్న సాత్విక్ జంట అంతిమ స్వప్నం సాకారం అవుతుందనడంలో సందేహం లేదు.

# పవన్‌కు రూ. 2.60 కోట్లు

**భారీ ధరకు తెలుగు టైటాన్స్ కొనుగోలు**

**ప్రో కబడ్డీ లీగ్ చరిత్రలోనే రికార్డు**

ముంబై: ప్రో కబడ్డీ లీగ్ చరిత్రలో అత్యంత ఖరీదైన ఆటగాడిగా భారత జట్టు కెప్టెన్ పవన్ కుమార్ సెహ్రావత్ వరుసగా రెండోసారి రికార్డు సృష్టించాడు. 10వ సీజన్ కోసం రెండు రోజులపాటు జరిగిన వేలంలో సెహ్రావత్‌ను తెలుగు టైటాన్స్ రూ. 2.60 కోట్ల భారీ మొత్తానికి కొనుగోలు చేసింది. గత సీజన్‌లో తమిళ్ తలైవాస్ పవన్‌ను రూ. 2.26 కోట్లకు దక్కించుకొంది. మొత్తం 595 మంది ఆటగాళ్లు వేలంలో నిలవగా.. ఆసియాడ్‌లో భారత్‌కు స్వర్ణం అందించడంలో కీలకపాత్ర పోషించిన సెహ్రావత్ కోసం తెలుగు టైటాన్స్, హరియాణా, యూపీ యోధ, బెంగళూరు పోటీపడ్డాయి. అత్యధిక ధర పలికిన విదేశీ ఆటగాడిగా ఇరాన్‌కు చెందిన మహ్మద్రెజా చియనెహ్ నిలిచాడు. అతడిని పుణెరి పల్టన్ రూ. 2.35 కోట్ల భారీ మొత్తానికి కొనుగోలు చేసింది. మణిందర్ సింగ్‌ను బెంగాల్ జట్టు రూ. 2.12 కోట్లకు కొనుక్కుంది. ఇక ఇరాన్ స్టార్ అత్రాచెలిని రూ. 1.60 కోట్లకు గుజరాత్ దక్కించుకొంది. అలాగే సిద్ధార్థ్ దేశాయ్ రూ. కోటి, అషు మాలిక్ రూ.96 లక్షలు, మీతూ రూ. 93 లక్షలు, మన్‌జీత్‌ను రూ. 92 లక్షలకు వివిధ జట్లు కొనుగోలు చేశాయి.



Edited, Printed, Published & owned by GOSUKONDA PRUDHVIRAJU, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at Panidhar PUBLICATIONS, H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: GOSUKONDA PRUDHVIRAJU,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in